ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 19 ఆగస్టు 2024



సీఐల బదిలీలు

పార్వతీపురం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలువురు సీఐలకు బదిలీలయ్యాయి. ఈ మేరకు పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావును విశాఖపట్నం వీఆర్‌కు కేటాయించారు. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి నారాయణరావు వస్తున్నారు. సాలూరు సీఐగా బి.అప్పలనాయుడు నియామకమయ్యారు. అక్కడ సీఐగా పనిచేసిన వాసునాయుడును అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. పార్వతీపురం వీఆర్‌లో ఉన్న మురళీధర్‌ను డీఎస్‌బీకి పంపించారు. ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణకు ఆమదాలవలస బదిలీ చేయగా, నర్సీపట్నం రూరల్ సీఐ హరి ఇక్కడకు వస్తున్నారు.

స్థాయి పెరిగినా.. అవే వెతలు



గణేష్ కాలనీలో ఇంకా తొలగని వరదనీరు..



- సమస్యల వలయంలో పార్వతీపురం
- జిల్లాకేంద్రంగా మారినా ప్రయోజనం శూన్యం
- అభివృద్ధిపై దృష్టిసారించని గత వైసీపీ సర్కారు
- తొలగని ముంపు ముప్పు..
- వేధిస్తున్న తాగునీటి, ట్రాఫిక్ కష్టాలు
- ఇబ్బందుల్లో పట్టణవాసులు
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు

పార్వతీపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురం సమస్యలకు నిలయంగా మారింది. డివిజన్ కేంద్రం నుంచి జిల్లాకేంద్రంగా మారినా.. ఏ ప్రయోజనం లేకుండా పోయింది. దీర్ఘకాలికంగా ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వం పట్టణవాసుల వెతలుపై దృష్టి సారించలేదు. మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయలేదు. కాలువలు, రోడ్లు తదితర నిర్మాణాలేవీ చేపట్టలేదు. ముంపు, తాగునీటి సమస్యలను కూడా పరిష్కరించలేదు. గత ఐదేళ్లూ.. చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులేవీ చెప్పట్టలేదు. దీంతో జిల్లాకేంద్రం పరిస్థితి అధ్వానంగా మారింది.

ఇదీ పరిస్థితి..

- పార్వతీపురం పట్టణ వాసులను దీర్ఘకాలికంగా వేధిస్తున్న వాటిల్లో ముంపు సమస్య ఒకటి. కొద్దిపాటి వర్షానికే పట్టణ రహదారులపై రోడ్డు, మురుగునీరు నిలిచిపోతుంది. దీంతో ఆయా ప్రాంతాలన్నీ చెరువులను తలపిస్తుంటాయి. మరోవైపు లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీలు కూడా జలమయమవుతాయి. రోజుల తరబడి ఆయా ప్రాంతవాసులు ముంపులోనే ఉండాల్సి పరిస్థితి. దీంతో వర్షం పడితే చాలు.. వారిలో వణుకు పుడుతుంది. ఏటా వర్షాకాలంలో పట్టణంలో ప్రధాన రహదారి మేదరవీధి జంక్షన్ నుంచి కంగటవీధి జంక్షన్ పూర్తిగా ముంపునకు గురవుతుంది. కాలువల్లో ఉన్న మురుగునీరు సైతం రోడ్డుపై నిలిచిపోతుంది. దీంతో ఈ మర్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను కొంతవరకు పరిష్కరించారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిపై శ్రద్ధ చూపలేదు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారీ పట్టణవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. తాజాగా గురువారం కురిసిన భారీ వర్షానికి పట్టణ ప్రధాన రహదారిలో మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచింది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించలేకపోయారు. ఇదిలా ఉండగా పార్వతీపురంలో గట్టిగా గాలివేస్తే చాలు.. గంటలకొద్దీ విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. తిరిగి ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



రద్దీగా పార్వతీపురం ప్రధాన రహదారి

- వేసవికాలంలో జిల్లా కేంద్ర ప్రజలు తాగునీటికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. బిందెడు నీటి కోసం పరుగులు పెట్టాల్సి వస్తోంది. వేసవిలో మూడు, నాలుగు రోజుకొకసారి మాత్రమే కొళాయిల ద్వారా నీరు సరఫరా అవుతంది. శివారు కాలనీ ప్రాంతాలకైతే రెండు రోజులకొకసారి ట్యాంకుల ద్వారా నీటిని అందిస్తుంటారు. అయితే కొన్నిచోట్ల కొళాయిలు సరిగ్గా పనిచేయడం లేదు. దీనిపై గత వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మారాయి. మెగా రక్షిత పథకం పనుల కోసం శిలాఫలకాలు వేసి మమా అనిపించారు. మొత్తంగా జిల్లా కేంద్రంలో తాగునీరు సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపలేకపోయారు.
- దీర్ఘకాలికంగా వేధిస్తున్న డంపింగ్‌యార్డు సమస్య కూడా కొలిక్కి రావడం లేదు. జిల్లాకేంద్రంలో ఉన్న డంపింగ్‌యార్డు తరలిస్తామని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. కానీ ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మొత్తంగా ఐదేళ్లలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయారు.
- గత టీడీపీ ప్రభుత్వ కాలంలో బైపాస్ రహదారి నిర్మాణానికి రంగం సిద్ధమైంది. అయితే ఈ లోపుగా ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో అంతా మారిపోయింది. గత ఐదేళ్లు వైసీపీ సర్కారు దానిపై దృష్టి సారించలేదు. బైపాస్ రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో నిత్యం జిల్లాకేంద్ర వాసులకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాకేంద్రంగా మారిన తర్వాత పార్వతీపురంలో వాహనాల సంఖ్య పెరిగింది. మరోవైపు పరిసర గ్రామస్థులంతా రోజూ పట్టణానికి వచ్చి తమకు కావాల్సిన సరుకులను కొనుగోలు చేస్తుంటారు. ఒడిశా వైపునకు వెళ్లే భారీ వాహనాలు సైతం పార్వతీపురం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో వాహనదారులు గంటలకొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. పట్టణంలో పార్కింగ్ ప్లేస్‌లు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలను ఎక్కడ పెట్టుకోవాలో తెలియని పరిస్థితి. పొరపాటున దుకాణాలకు ఎదురుగా వాహనాలు కనిపిస్తే.. ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో వాహనదారులు ఆన్‌లైన్‌లోనే అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తోంది.
- జిల్లాకేంద్రంలోని ప్రధాన సమస్యపై నూతన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి.. శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా ముంపు, తాగునీరు, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంకా ముంపులోనే..

పార్వతీపురం టౌన్, ఆగస్టు 18: జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఉన్న గణేష్ కాలనీ (శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీ) ఇంకా ముంపులోనే ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీలోకి వరద నీరు చేరింది. అయితే ఆ నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో మూడు రోజులుగా ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద, మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో నివాసితులు, విద్యార్థులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఏటా వర్షాకాలంలో ముంపు సమస్యను ఎదుర్కొంటున్నా పట్టించుకునే వారే కరువవడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గణేష్ కాలనీలో రహదారులు, కాలువల నిర్మాణానికి సంబంధిత ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి మరిచారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా గణేష్ కాలనీలో ముంపు సమస్య పరిష్కారానికి బృహత్తర ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు.

తేలని లెక్కలు

- జలజీవన్ మిషన్ పనులపై గ్రామస్థాయిలో విచారణ
- జలశక్తి, వాటర్ సాఫ్ట్ యాప్‌ల్లోని వివరాల్లో వ్యత్యాసం
- గుర్తించిన అధికారులు

సీతంపేట, ఆగస్టు 18: జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) కింద జిల్లాలోని గ్రామస్థాయిలో చేపట్టిన పనులపై విచారణ చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. గత వైసీపీ సర్కారు హయాంలో జరిగిన ఈ పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే సంబంధిత అధికారులు జిల్లాలో పలుచోట్ల విచారణ ప్రారంభించారు. కేంద్ర సర్కారు జలశక్తి యాప్‌లో పొందుపరిచిన నివేదికలకు, రాష్ట్ర ప్రభుత్వ వాటర్ సాఫ్ట్ యాప్‌లో పొందుపరిచిన వివరాలకు పొంతన కుదరడం లేదని, అందు వల్ల జేజేఎం లెక్కలు తేలడం లేదని వారు స్పష్టం చేస్తున్నారు.



సీతంపేటలో వృథాగా పడి ఉన్నపైపులు

- మరోవైపు జలజీవన్ మిషన్ పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, వీటిపై గ్రామస్థాయిలో విచారణ జరపాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ నెల 20 నాటికి విచారణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికీ వెళ్లి కొళాయిల ద్వారా తాగునీరు వస్తుందా.. లేదా? అనే దానిపై పరిశీలించి.. నివేదికలు అందజేయాలని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీనిపై గ్రామీణ తాగునీటి సరఫరా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఢిల్లీరావును వివరణ కోరగా.. కాంట్రాక్టర్లకు రూ.3 కోట్ల వరకు బకాయిలు ఉండడం వల్ల జేజేఎం పనులు జరగడం లేదన్నారు. ప్రభుత్వం విచారణ నిర్వహిస్తోందని, అది పూర్తయితే పనులు పునఃప్రారంభిచనున్నట్లు తెలిపారు.

ఇదీ పరిస్థితి..

పాలకొండ నియోజకవర్గం పరిధి వీరఘట్టం, భామిని, సీతంపేట, పాలకొండ మండలాల్లోని 834 గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో జేజేఎం కింద పనులు చేపట్టాల్సి ఉంది. అయితే 159 గ్రామాల్లో ఆ పనులు పూర్తికాగా 331 గ్రామాల్లో ప్రారంభం దశలో ఉన్నాయి. మరో 344 గ్రామాల్లో పనులు ప్రారంభించాల్సి ఉంది. పనులు పూర్తయిన వాటికి రూ.మూడు కోట్ల వరకు బిల్లులు బకాయిలు ఉన్నాయి. దీంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. వాస్తవానికి జలజీవన్ మిషన్ పనులు ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో భిన్న పరిస్థితులు నెల కొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో లక్ష్యం మేరకు ఎక్కడా పనులు జరగలేదు.



తిత్తాలపాడులో కొళాయిల నుంచి తాగునీరు సరఫరా కాని దృశ్యం

నేడే రక్షా బంధన్

- జిల్లావాసులు సన్నద్ధం
- విరివిగా రాఖీల అమ్మకాలు
- మార్కెట్లన్నీ కిటకిట
- అంతటా సందడి వాతావరణం

సాలూరు రూరల్, ఆగస్టు 18: సోదరసోదరీమణుల అనురాగం, అప్యాయతలకు ప్రతీక రక్షాబంధన్.. ఏటా శ్రావణ పౌర్ణిమ నాడు ఈ పండగ జరుపుతారు. ఆరోజున అక్కాచెల్లెళ్లు తమ అనుబంధానికి గుర్తుగా సోదరులకు రాఖీలను కట్టి అభిమానాన్ని చాటుకుంటారు. ఇందు కోసం ఎక్కడెక్కడో ఉన్న సోదర సోదరీ మణులు ఒక్కచోటుకు చేరుకుంటారు. అయితే రాఖీ పౌర్ణిమను సోమవారం నిర్వహించేందుకు జిల్లావాసులు సన్నద్ధమయ్యారు. దీంతో జిల్లా అంతటా సందడి వాతావరణం నెలకొంది. మార్కెట్లలో రంగు రంగుల రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. రూ. 20 నుంచి రూ. 50 మధ్య రాఖీలు ఎక్కువగా అమ్ముడయ్యాయి. మరోవైపు పిల్లల కోసం వినూత్న డిజైన్లలో రూపొందించిన రాఖీలు అందర్నీ ఆకట్టుకు న్నాయి. పది రూపాయలు మొదలుకొని రెండు మూడు వందల రూపాయల్లో ఇవి లభిస్తున్నాయి. ఇక సిల్వర్ కోటింగ్ రాఖీలు రూ. 150 నుంచి లభ్యం అవుతుండగా వెండితో తయారుచేసిన రాఖీలు బరువును బట్టి రూ.400 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతోంది. సోదరీమణులు రాఖీల కొనుగోలులో నిమగ్నమవగా.. సోదరులు వారికి మంచి బహుమతులు ఇచ్చే పనిలో పడ్డారు. దీంతో స్వీటు షాపులు, వస్త్ర, గిఫ్ట్‌ల దుకాణాలు కూడా ఆదివారం కిటకిటలాడాయి. రక్షాబంధన్ సందర్భంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ. మూడు కోట్లకు పైగా రాఖీల వ్యాపారం జరుగుతుందని వ్యాపారులంటున్నారు. ఇకపోతే ఉపనయనం అయిన వారు రాఖీ పౌర్ణమి రోజున గాయత్రీ పూజచేసి కొత్త యజ్ఞోపవీతాన్ని (జంధ్యాలు) ధరించి పాతది తీసేస్తారు.



ఆన్‌లైన్‌లో..

రాఖీ కట్టడానికి అందుబాటులో లేని సోదరుల కోసం కొంతమంది సోదరీమణులు ఆన్‌లైన్ బాట పట్టారు. ఇప్పటికే చాలామంది వివిధ ప్రాంతాలు, దేశాల్లో ఉన్న తమ సోదరులకు కొరియర్ ద్వారా రాఖీలు పంపించారు. మూడేళ్ల కిందట నుంచి ఈ ఆన్‌లైన్ వ్యాపారం ఊపందుకోగా.. పోస్టల్ శాఖ సైతం రాఖీ సేవను ప్రారంభించింది. కొన్ని ఆన్‌లైన్ సంస్థలు.. తమ క్లయింట్ చెప్పిన డిజైన్‌లో రాఖీని తయారుచేసి వారి సోదరులకు అందేటట్టు చూస్తున్నారు. మొత్తగా వాటి అమ్మకాలు ముమ్మరంగా సాగుతున్నాయి.



ఏజెన్సీలో మౌలిక వసతులకు కృషి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ వెల్లడి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 18 : పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన గుమ్మలక్ష్మీపురం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా తొలుత గొరడ గ్రామంలో గిరిజన మహిళలతో కలిసి వరినాట్లు వేశారు. అక్కడి వారితో మాట్లాడి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు తయారు చేసే జీవామృతం, తదితర ఎరువులను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహిస్తామని, జీవామృతం తయారీకి ఉచితంగా డ్రమ్ములను అందిస్తామని తెలిపారు. గొరడ గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో, డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు.

తోటపల్లి అభివృద్ధికి సహకారం

గరుగుబిల్లి: చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. దేవదాయశాఖ ఏ మేర నిధులు మంజూరు చేసింది, ఎంత వ్యయం జరిగిందన్న సమాచారాన్ని ఈవో సూర్యనారాయ ణను అడిగి తెలుసుకున్నారు. ఆలయ పూర్వ వైభవానికి అవసరమైన నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టుతో పాటు ఆలయం, ఆహ్లాదకర వాతావరణానికి నెలవైన ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

సీతంపేటలో గర్భిణుల వసతిగృహం

సీతంపేట ఐటీడీఏలో గిరిజనుల గర్భిణుల కోసం వసతిగృహాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం వైటీసీలోని గర్భిణుల వసతిగృహంలో వసతులను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు. గుమ్మ లక్ష్మీపురం, కురుపాం మండలంలో గిరిజన రైతులు ప్రకృతి వ్యవ సాయం చక్కగా చేస్తున్నారన్నారు. పాఠశాల ఆవరణతో పాటు పలు చోట్ల ఆకు కూరలు, కాయగూరల పెంపకం చేపట్టాలని గిరిజనులకు సూచించారు.



గొరడ గ్రామంలో గిరిజన సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రకృతి సాగుకు ప్రోత్సాహం

ఈ ఏడాది జిల్లాలో 74,811 మంది రైతులు 94,082 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేటట్టు ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ చెప్పారు. ఇందులో 38,500 మంది రైతులు 48,538 ఎకరాల విస్తీర్ణంలో శత శాతం ప్రకృతి సాగు చేపట్టాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కేవలం వ్యవసాయమే గాకుండా కోళ్ల, పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని సూచించారు. అవి రైతులు అదనపు ఆదాయాన్ని ఇస్తాయని, వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ తెలిపారు.

మళ్లీ వచ్చాయ్..

- నందివానివలసలో ఏనుగుల సంచారం

గరుగుబిల్లి, ఆగస్టు 18 : గరుగుబిల్లి మండలానికి మళ్లీ ఏనుగులు వచ్చాయి. గత వారం రోజుల కిందట విజయనగరం జిల్లా వంగర మండలానికి వెళ్లిన గజరాజులు తిరిగి ఆదివారం మండలంలో ప్రత్యక్షమయ్యాయి. నందివానివలస సమీపంలో అవి సంచరించడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎనిమిది ఏనుగుల గుంపు గ్రామాలకు ఆనుకుని ఉండడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఎలా చేపట్టగలమని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఏనుగులు సంచారంతో రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఏనుగుల గుంపును వేరే ప్రాంతానికి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



నందివానివలస సమీపంలోని తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

టైమ్ సీక్వెన్స్ టెస్ట్

1. తేజకు అతని సోదరి నందిత పుట్టినరోజు జూలై 21 నుంచి జూలై 26 మధ్య అని గుర్తు. మరో సోదరుడు భవేష్‌కు వారి సోదరి పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. అయితే నందిత పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జూలై 26 బి) జూలై 25
సి) జూలై 24 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: తేజకు అతని సోదరి పుట్టినరోజు జూలై 21 నుంచి 26 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు తీసుకోవాలి. 22, 23, 24, 25 భవేష్‌కు, సోదరి నందిత పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు 25, 26, 27, 28.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉండే తేదీ '25' అనగా జూలై 25 సమాధానం అవుతుంది.

2. సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 12 మధ్య అని గుర్తు. అతని సోదరి సౌమికకు వారి తల్లితండ్రుల పెళ్లిరోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 4 మధ్య అని గుర్తు. అతని సాత్విక్, సౌమికల తల్లిదండ్రుల పెళ్లిరోజు అవుతుంది?

ఎ) అక్టోబర్ 10 బి) అక్టోబర్ 11
సి) అక్టోబర్ 10 లేదా 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి 12కు మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 8, 9, 10, 11. అతను సోదరి సౌమికకు వారి తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 14కు మధ్య అని గుర్తు, ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 10, 11, 12, 13.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉన్న తేదీలు 10, 11. ఈ విధంగా రెండు తేదీలు వచ్చినప్పుడు అక్టోబర్ 10 లేదా అక్టోబర్ 11 (అనగా either, or)) సమాధానంగా గుర్తించాలి.

3. పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుంచి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరో సోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 26ల మధ్య అని గుర్తు. అయిన పవిత్ర మౌనికల ప్రకారం వారి సోదరి మేఘన పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జనవరి 23 బి) ఫిబ్రవరి 23
సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుండి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరోసోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 24ల మధ్య అని గుర్తు.

గమనించండి: ఇద్దరి సమాచారం ప్రకారం నెలలు వేర్వేరుగా ఉన్నాయి. దాదాపు 30 రోజుల తేడా ఉన్నది. కావున సమాధానం చెప్పలేం అవుతుంది.

4. ఒక బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని.లకు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది. తరవాత బస్సు 11.30 ఎ.ఎం. అని చెప్పారు. అయిన ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికునితో ఏ సమయంలో చెప్పారు?


ఎ) 10.50 ఎ.ఎం. బి) 11.00 ఎ.ఎం.
సి) 11.10 ఎ.ఎం. డి) 11.15 ఎ.ఎం.

సమాధానం: (బి)

వివరణ: బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని. ఉంది. తదుపరి బస్సు వచ్చే సమయం గం. 11.30 ని. అనగా ముందు బస్సు వచ్చిన సమయం 11.30-45 ని. = గం. 10.45 ని. విచారణాధికారి ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది అని చెప్పారు. దాని అర్థం ప్రయాణికుడు 15 ని. ఆలస్యంగా వచ్చాడు. (ఆలస్యంగా వస్తేనే కదా బస్సు వెళ్ళి పోయింది) కాబట్టి విచారణాధికారికి, ప్రయాణికునికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.45+15 ని.= 11.00 ఎ.ఎం. అవుతుంది.

5. ఒక కార్యాలయంలో 30 మంది ఉద్యోగులు ఉన్నారు. 10 మంది ఉద్యోగులు మొదటి గ్రూపుగా ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 1.00 గం. వరకు పని చేస్తారు. 12 మంది వ్యక్తులు రెండో గ్రూపుగా ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గం. వరకు పనిచేస్తారు. 8 మంది వ్యక్తులు మూడో గ్రూపుగా ఉదయం 11.00 గం.ల నుంచి సాయంత్రం 5 గం. పనిచేస్తారు. అయితే కార్యాలయంలోని ఉద్యోగులందరూ ఏ సమయం నుంచి ఏ సమయం వరకు కలుసుకుంటారు?

ఎ) 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.



బి) 10 ఎ.ఎం. నుంచి 12 మధ్యాహ్నం
సి) 1 పి.ఎం. నుంచి 3 పి.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: కార్యాలయంలో ఉద్యోగులందరు కలుసుకునే సమయం అనగా మూడు గ్రూపుల వారికి కామన్ టైమ్ తీసుకోవాలి. మొదటి గ్రూపు పని చేసే వేళలు 7.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.వరకు అనగా 7-8, 8-9, 9-10, 10-11, 11-12, 12-11

రెండో గ్రూపువారు పనిచేసే వేళలు 9.00 ఎ.ఎం. నుంచి 3.00 పి.ఎం. వరకు అనగా 9-10, 10-11, 11-12, 12-1, 1-2, 2-3. మూడో గ్రూపువారు పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 5.00 పి.ఎం. వరకు అనగా 11-12, 12-1, 1-2, 2-3, 3-4, 4-5. **గమనించండి:** మూడు గ్రూపులలో కామన్ టైమ్ 11 నుంచి 1 వరకు అని తెలుస్తున్నది. కాబట్టి మూడు గ్రూపులు కార్యాలయంలో కలిసి పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం. సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

భారతీయ సమాజంలో అసమానతలకు బీజం వేసింది నాలుగంచెల చాతుర్వర్ణ వ్యవస్థ. ఎగువ అంచెల వారి కి పాలనాధికారాన్ని, ప్రతిష్ఠను కట్టబెట్టి దిగువ అంచెల వారిని వారికి సేవకులను చేసింది. అన్నింటికన్నా దిగువ అంచె అయిన శూద్రుల్లో సేవక కులాలనన్నింటినీ జమచేయడం జరిగింది. వారి వృత్తులను బట్టి కాలక్రమంలో శూద్రుల్లో కూడా స్థాయీ భేదాలు వచ్చాయి. కొన్ని పనులు చేసేవారు అంటరాని వారయ్యారు. ఊరిలోని మాలిన్యాన్ని తొలగిస్తూ, అందరి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ తాము మాత్రం ఊరవతలకే పరిమితమయ్యారు. కనీస అవసరాలకు నోచుకోలేదు. కాలక్రమంలో వీరే దళితులుగా పిలువబడ్డారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన శూద్ర కులాల వారి అభ్యున్నతికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి పురోభివృద్ధికి బాటలు వేసింది. అయితే దళితులను(మాల, మాదిక, వారి ఆశ్రిత కులాలను) షెడ్యూల్డ్ క్యాస్ట్, వివిధ ఆదివాసీ జాతులను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా పేర్కొంటూ మూకుమ్మడి రిజర్వేషన్లను రెండు వర్గాల్లో అమలు చేశారు. అయితే తదనంతర కాలంలో అనగా 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు. ఈ వర్గీకరణ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో అనుసరించలేదు. దీని కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని కొన్ని ఆధిపత్య కులాలు, జనాభాపరంగా తక్కువ సంఖ్య ఉన్న కులాలు రిజర్వేషన్ ఫలాలను ఎక్కువగా పొందాయి. క్రమంగా వారి తరవాతి తరాలూ ఈ లబ్ధిని కొల్లగొట్టాయి. ఏబీసీల మాదిరి క్రిమిలేయర్ విధానం కూడా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో లేకపోవడంతో అభివృద్ధి చెందిన ఉప కులాలే మరింత రిజర్వేషన్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందారు. ఇతర ఉపకులాలు అణగారిపోయారు. ఎస్సీ, ఎస్టీల్లోని అనేక కులాలు, ఆశ్రిత కులాల్లో దీనిపై అసంతృప్తి ఉన్నప్పటికీ తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల్లోని మాదిగ కులం వారిలో చైతన్యం వచ్చింది.

> 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు.

ఎస్సీ ఉపవర్గీకరణ పోరాట పుట్టినిల్లు తెలుగుగడ్డ

అనాదిగా చర్మకారులుగా అట్టడుగు స్థాయిలో ఉన్న మదిగవారు, తమ తోటి ఉపవర్గం వారితో కూడా అంటరానివారిగా చూడబడ్డారు. తమకన్నా సామాజికంగా ముందున్న మాల వారితో కలిసి ఉమ్మడిగా అవకాశాలు పంచుకోవాల్సి రావడం అన్యాయంగా గుర్తెరిగారు.

జనాభాపరంగా తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న మాల వారు ఉమ్మడి రిజర్వేషన్లు కారణంగా ఎక్కువ లబ్ది పొందుతున్నారని గ్రహించారు. తమకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలుచేయాలని ఏడో దశకం నుంచి ప్రభుత్వాలకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటైన నాటినుంచి ఎస్సీ ఉపవర్గీకరణ పోరాటం ఉద్యమ స్థాయిని అందుకుంది. తమ పోరాటానికి 'మాదిగ దండోరా' ఉద్యమంగా నామకరణం చేశారు. వరుసగా భారీఎత్తున దండోరా సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఎస్సీల్లో ఉపకులాలను వారి సామాజిక స్థాయి, జనాభా ఆధారంగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డి అనే కేటగిరీలుగా అమలు చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సమాజం నుంచి మద్దతు కూడగట్టారు.

ఈ ఉద్యమఫలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి సూచనలు కోరింది. 1997లో ఈ కమిషన్ ఎస్సీలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోమని సూచించింది. తత్ఫలితంగా 1997 జూన్ 6న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీలకు ఉన్న 15% కోటాను ఏ, బీ, సీ, డీ వర్గాలుగా విభజిస్తూ ఒక జీవోను విడుదల చేసింది. ఏ గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలను చేర్చి 1 శాతం కోటాను, బీ గ్రూపులో మాదిగ, దాని ఉప కులాలను చేర్చి 7శాతం కోటా, సీ గ్రూపులో మాల, దాని ఉపకులాలను చేర్చి 6శాతం కోటా, డీ గ్రూపులో ఆది ఆంధ్రులతో పాటు ఇతర కులాలను చేర్చి 1 శాతం కోటాను ఇచ్చారు. ఈవిధంగా ఏ గ్రూపును ఎస్సీల్లో అట్టడుగు కులాల గ్రూపుగా తదుపరి బీ, సీ, డీలను క్రమానుగతంగా దాని పైస్థాయి గ్రూపులుగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లలో కోటాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే మాలలు ఈ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మాల మహానాడు సంఘం ఈ రిజర్వేషన్ వర్గీకరణను న్యాయస్థానంలో సవాలు చేసింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జీవో రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో లేని విషయమని తీర్పు ఇవ్వడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. తదుపరి మరలా ఎంఆర్‌పీఎస్ పోరుబాట పట్టింది. దీంతో 2000 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం' ద్వారా తిరిగి ఎస్సీ ఉప వర్గీకరణను ప్రవేశపెట్టింది. 2004 నవంబరు వరకూ ఈవిధంగా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం అమలులో ఉంది. 2004లో ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో 5గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ ఉప వర్గీకరణ చెల్లదని, ప్రకరణ 341(1) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు సజాతీయ కులాలను ఎస్సీలుగా వర్గీకరించారని, దానిని తిరిగి ఉప వర్గీకరించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు లేదని తీర్పునిచ్చింది. దీంతో మరలా కథ మొదటికి వచ్చింది. తిరిగి ఎంఆర్‌పీఎస్ ఉద్యమించడంతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు పార్లమెంటు రాజ్యాంగ సవరణ చట్టం తీసుకురావాల్సిందిగా కోరుతూ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసింది. దీంతో కేంద్రం 2007లో ఉషామెహ్రా కమిషన్‌ను ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎదురయ్యే రాజ్యాంగ, చట్టపరమైన అవరోధాలను పరిశీలించి తగిన సూచనలు చేయాల్సిందిగా కోరింది. 2008లో నివేదిక సమర్పించిన ఈ కమిషన్ రాజ్యాంగ ప్రకరణ 341కి క్లాజ్ 3ని చేర్చి, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు పార్లమెంటు ఆమోదించే అవకాశాన్ని ఏర్పాటు చేయవచ్చని సూచించింది. ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచిలో)

రాజకీయాల్లో..

క్షత్రియులకు అవకాశం కల్పిస్తాం

- క్షత్రియభవన్‌కు భూమిని కేటాయిస్తాం
- క్షత్రియ సేవా సమితి.. అభినందన సభలో తెలంగాణ సీఎం రేవంత్
- ప్రభాస్ సినిమాపై పొగడ్తల వర్షం
- తెలుగు సినిమాను విశ్వవ్యాప్తం చేశారని వ్యాఖ్య



క్షత్రియ సేవాసమితి అభినందన సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో క్షత్రియ సామాజికవర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని, నగరంలో క్షత్రియ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొని, ప్రసంగించారు. 1960లలోనే క్షత్రియులు ఆంధ్రప్రాంతం నుంచి హైదరాబాద్‌కు వచ్చి.. ద్రాక్ష తోటలు, పౌల్ట్రీ వంటి వ్యాపారాలు నిర్వహించారని.. శ్రమ, అకుంఠిత దీక్షతో ఉన్నతస్థాయికి ఎదిగారని రేవంత్‌రెడ్డి వివరించారు. కష్టపడే గుణం వల్ల క్షత్రియులు ఎక్కడైనా విజయవంతమవుతారన్నారు. "క్షత్రియులకు రాజకీయాల్లో తగిన ప్రోత్సాహం అందిస్తాం. మీరే తగిన పేర్లు ఇస్తే.. వారికి పార్టీ పదవులు ఇచ్చి.. కార్పొరేటర్, ఎమ్మెల్యే ఎన్నికల్లో అవకాశం కల్పిస్తాం" అని క్షత్రియ సేవాసమితిని కోరారు. ఆంధ్రాలో అల్లూరి సీతారామరాజు, తెలంగాణలో కొమరం భీం పోరాట యోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని.. ముందుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లతోపాటు ఫ్యూచర్‌సిటీని అభివృద్ధి చేయబోతున్నామని, దానిలో కూడా రాజులు భాగస్వాములు కావాలన్నారు. పెట్టుబడులతో ముందుకొస్తే అన్నివిధాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో క్షత్రియ కమ్యూనిటీ భాగస్వామ్యం ఉందన్నారు. కర్ణాటకలో రాజకీయ సమీకరణలు, పరిస్థితుల ప్రభావం వల్ల బోసురాజుకు పోటీచేసే అవకాశం రాలేదన్నారు. మంత్రివర్గం ఏర్పాటు సమయంలో మంత్రి పదవి కేటాయించాలని స్వయంగా రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు. దీన్ని బట్టి.. రాజులు క్రమశిక్షణతో పనిచేస్తారనే అభిప్రాయం అధిష్ఠానంలో ఉందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా శ్రీనివాస్‌రాజును నియమించడం రాజులపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి ప్రతీక అన్నారు. "క్షత్రియభవన్ స్థలాన్ని మేము అందిస్తాం, భవనాన్ని మీరు నిర్మించండి మళ్లీ జరిగే సమావేశం క్షత్రియ భవన్‌లో జరుపుకుందాం" అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, తెలుగు రాష్ట్రాలకు చెందిన క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు నాగరాజు, నాని, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభాస్ సినిమాపై..

విజయానికి, విశ్వాసానికి క్షత్రియులు మారుపేరని పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇదే సామాజిక వర్గానికి చెందిన ప్రభాస్.. తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. ప్రభాస్ కాకుండా వేరే నటుడిని బాహుబలి స్థానంలో ఊహించుకోలేమన్నారు. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో బోసురాజు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా దివంగత సినీనటుడు కృష్ణంరాజుతో తనకు ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు.

'లేటరల్ ఎంట్రీ'తో

యువతకు అన్యాయం

- ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల నియామకం
- ఐఏఎస్‌ల ప్రైవేటీకరణ... రిజర్వేషన్ల అంతానికి మోదీ హామీ: రాహుల్



న్యూఢిల్లీ, ఆగస్టు 18: వివిధ మంత్రిత్వ శాఖల్లో పోస్టులను లేటరల్ ఎంట్రీ విధానంలో భర్తీ చేయాలని కేంద్రం నిర్ణయించడంపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. యూపీఎస్సీకి బదులు ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తూ రాజ్యాంగంపై ప్రధాని మోదీ దాడి చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బహిరంగంగానే లాక్కుంటున్నారని ఆయన ఆదివారం 'ఎక్స్'లో ఆరోపించారు. లేటరల్ ఎంట్రీలో ప్రభుత్వ ఉద్యోగులను నియమించుకోవడం జాతి వ్యతిరేక చర్యని ధ్వజమెత్తారు. 'అణగారిన వర్గాలకు ఉన్నత స్థానాల్లో ప్రాధాన్యం దక్కడం లేదని ఎప్పటినుంచో చెబుతున్నాం. దాన్ని మెరుగుపరచడానికి బదులు లేటరల్ ఎంట్రీ పేరుతో వారిని ఉన్నత పదవులకు మరింత దూరం చేస్తున్నారు. ఇది యూపీఎస్సీకి సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువత హక్కులు కాలరాయడమే. అణగారిన వర్గాలకు రిజర్వేషన్లతో సహా సామాజిక న్యాయం అనే భావనపై దాడి చేస్తున్నారు. నిర్ణయాత్మక ప్రభుత్వ పదవుల్లో కూర్చోవడం ద్వారా కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఏం చేస్తారో చెప్పడానికి సెబీ ఒక స్పష్టమైన ఉదాహరణ. పాలనా వ్యవస్థను, సామాజిక న్యాయాన్ని దెబ్బతీసే ఈ జాతి వ్యతిరేక చర్యను ఇండియా కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది' అని రాహుల్ పేర్కొన్నారు. ఐఏఎస్‌ల ప్రైవేటీకరణ అనేది రిజర్వేషన్ల రద్దుకు మోదీ హామీ అని ఆయన దుయ్యబట్టారు.

అకోబరు 2 నుంచి ఆందోళన: అఖిలేశ్

లేటరల్ ఎంట్రీ విధానం అమలును సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ తప్పుబట్టాయి. బీజేపీ చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ట్వీట్ చేశారు. దీనిపై అక్టోబరు 2నుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వారి కోటా ప్రకారం నియామకాలు చేపట్టకపోతే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి పేర్కొన్నారు. ఈ విధానం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనమని, ఇది రాజ్యాంగ విరుద్ధం, చట్ట వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వివిధ శాఖల్లోని జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల వంటి కీలక పోస్టుల్లో 45 మందిని లేటరల్ ఎంట్రీ విధానంలో నియామకానికి యూపీఎస్సీ శనివారం దరఖాస్తులు ఆహ్వానించింది.

కమల కంటే నేనే అందంగా ఉంటా..



పెన్సిల్వేనియా, ఆగస్టు 18: అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన ప్రత్యర్థి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై మరోసారి నోరుపారేసుకున్నారు. పెన్సిల్వేనియాలోని విల్కేస్- బారిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ట్రంప్ మాట్లాడుతూ, కమలా హారిస్ నవ్వు భయంకరంగా ఉంటుందని, ఆమె కంటే తానే అందంగా ఉంటానని వ్యాఖ్యానించారు. టైమ్ మ్యాగజైన్ కవర్ పేజీపై కమలా హారిస్ ఫొటోను ముద్రించడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గాజాస్ట్రిప్, ఆగస్టు 18: అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ పర్యటన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన బాంబింగ్‌లో 19 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. కాల్పుల విరమణకు అమెరికా ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం బ్లింకెన్ గాజాలో పర్యటించడానికి ముందు ఈ దాడులు జరగడం గమనార్హం! సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో బ్లింకెన్ భేటీ కానున్నారు.

బ్లింకెన్ పర్యటన వేళ..
గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గాజాస్ట్రిప్, ఆగస్టు 18: అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ పర్యటన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన బాంబింగ్‌లో 19 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కాల్పుల విరమణకు అమెరికా ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం బ్లింకెన్ గాజాలో పర్యటించడానికి ముందు ఈ దాడులు జరగడం గమనార్హం.! కాగా.. సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో బ్లింకెన్ భేటీకానున్నారు.

కోస్ట్‌గార్డ్ డీజీ రాకేష్ పాల్ హఠాన్మరణం

- సమర్థుడైన అధికారిని కోల్పోయాం: రాజ్‌నాథ్ సింగ్



రాకేష్ పాల్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేష్ పాల్(58) గుండెపోటుతో మరణించారు. ఆదివారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు కోస్టుగార్డ్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అనంతరం కొద్దిసేపటికే ఆయన మరణించారు. విషయం తెలియడంతో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెంటనే ఆస్పత్రికి వెళ్లి రాకేష్ పాల్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన సమర్థవంతమైన, నిబద్ధతతో కూడిన అధికారి అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, ఐసీజీ 25వ డైరెక్టర్ జనరల్‌గా రాకేష్ పాల్ గతేడాది జూలై 19న బాధ్యతలు స్వీకరించారు. ఆయన భౌతికకాయాన్ని ఢిల్లీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఉక్రెయిన్ అణు కేంద్రానికి సమీపంలో డ్రోన్ దాడి

- ప్లాంట్ భద్రతపై అణు ఇంధన సంస్థ ఆందోళన
- ఉభయులూ సంయమనం పాటించాలని ఐఏఈఏ విజ్ఞప్తి

కీవ్, ఆగస్టు 18: ఉక్రెయిన్‌కు చెందిన అణు కేంద్రం భద్రతపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న జపోరిజియాలోని ఈ అణు కేంద్రం సమీపంలో డ్రోన్ దాడి జరగడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ మారియానో గ్రోసీ తెలిపిన మేరకు ఈ అణు కేంద్రం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ఈ ప్లాంట్ సిబ్బంది ఉపయోగించే రోడ్డుపై ఉక్రెయినే ఈ డ్రోన్ దాడికి దిగిందని రష్యా మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ప్లాంట్‌కు చెందిన కూలింగ్ స్ప్రింక్లర్స్‌కు సమీపంలో, 750 కిలోవాట్ల పవర్ లైన్‌కు కేవలం వంద మీటర్ల దూరంలో ఈ డ్రోన్ ద్వారా పేలుడు జరపడం కలవరపెడుతోందని, ఇప్పటికైనా ఉభయ పక్షాలు సమయమనం పాటించాలని గ్రోసీ విజ్ఞప్తి చేశారు. దాడి జరిగిన ప్రాంతాన్ని తమ బృందం పరిశీలించిందని, డ్రోన్ దాడిలో ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదని, అలాగే, అణు కేంద్రానికి చెందిన పరికరాలపైనా ప్రభావమేమీ లేదని గ్రోసీ తెలిపారు. ప్లాంట్‌కు చెందిన రెండు మెయిన్ గేట్లకు మధ్య రోడ్డుపై ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. యూరప్‌లోనే అతి పెద్దదైన జపోరిజియాలోని ఈ అణు కేంద్రం ఫిబ్రవరి 2022 నుంచి రష్యా ఆధీనంలోకి వెళ్లింది.

వన్.. టు ..త్రి.. స్టార్ట్

● ఫొటో.. ఓ మధుర జ్ఞాపకం ● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

రాజాం రూరల్, ఆగస్టు 18: ఇప్పుడంటే స్మార్ట్‌ఫోన్ల పుణ్యాన ప్రతిఒక్కరూ క్షణాల్లో ఫొటోలు తీసేస్తున్నారు.. ఎడాపెడా సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేసేస్తున్నారు.. వెనుకటి కాలంలో ఫొటో తీయడం పెద్ద తతంగం. కెమెరాలో ఫిల్మ్ లోడ్‌చేసి, ఫొటోలు తీశాక డార్క్‌రూంలో జాగ్రత్తగా ఆ రీల్‌ను డెవలప్ చేసి ప్రింట్లు వేయాల్సి వచ్చేది. ఎంత అర్జంట్ ఫొటో అయినా గంటల తరబడి నిరీక్షించాల్సిందే. నాటి కాలంలో కెమెరా ఎదుట నిల్చుని ఫొటోలు తీయించుకున్నాక అవి ఎలా ఉన్నాయో చూసేందుకు రోజుల తరబడి కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సి వచ్చేదంటే అతిశయోక్తి కాదు. ఆ రోజుల్లో ఫొటోగ్రాఫర్లంటే జనాల్లో విపరీతమైన క్రేజుండేది. ఫొటో స్టుడియోల వ్యాపారం మూడు రీళ్లు, ఆరు ప్రింట్లుగా నడిచేది. ఇప్పటి స్మార్ట్ జమానాలో ఆ ట్రెండ్ కొంత మారినా, ఫొటోగ్రఫీకి ఆదరణ తగ్గలేదు. సునిశిత దృష్టి కలిగిన ఫొటోగ్రాఫర్లకు డిమాండ్ కూడా తగ్గలేదు. ఇప్పటికీ పెళ్లిళ్లు, ఇతరత్రా ఫంక్షన్ల ఫొటోల కోసం లక్షలు ఖర్చు చేస్తున్నారంటే ఫొటోగ్రఫీ ప్రాధాన్యత పెరుగుతున్నట్టే..

ఓ తీపి జ్ఞాపకం

ప్రతి ఫొటోకూ ఓ ప్రత్యేకత ఉండొచ్చు.. అది తీపిగుర్తు కావచ్చు..లేదా చేదు అనుభవమే కావచ్చు..వాటిని ఫొటోలుగా తీసి పదిలపరిస్తే.. తరచి తరచి చూస్తే.. అదో అనుభూతి... నెగిటివ్ నుంచి మొదలైన ప్రస్థానం నేటి సాంకేతిక విప్లవంలో కొత్తపుంతలు తొక్కు తోంది..


కెరీర్‌గా ఫొటోగ్రఫీ

ఫొటోగ్రఫీ వివిధ రంగాలకు విస్తరించింది. ల్యాండ్ స్కేప్, ఇంటీరియల్, పోర్ట్రయిట్, ఫ్యాషన్, వైల్డ్‌లైఫ్, స్ట్రీట్, పెట్, బేబీ, ఫ్యామిలీ, అడ్వర్టైజింగ్, మెడికల్ ఫొటోగ్రఫీ... దేనికదే ఒక ప్రత్యేకమైన నైపుణ్యంగా మలచుకుంటూ ఫొటోగ్రాఫర్లు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఫొటోగ్రఫీకి పెరుగుతున్న ప్రాధాన్యత నేపథ్యంలో శిక్షణ ఇచ్చే సంస్థలు ఏర్పాటవుతున్నాయి. విశ్వ విద్యాలయాలలో ఫొటోగ్రఫీ కోర్సులు ప్రారంభమయ్యాయి. జర్నలిజంలో కూడా ప్రపంచ వ్యాప్తంగా ఫొటోలకు ప్రాధాన్యత పెరిగింది.

నైపుణ్యంతోనే గుర్తింపు

సుంకరపల్లి సతీష్, ఫొటోగ్రాఫర్, రాజాం

ఫొటోగ్రఫీకి ఆదరణ, ప్రాధాన్యత తగ్గలేదు. నైపుణ్యత ఉంటే ఈ వ్యాపారానికి తిరుగులేదు. మారుతున్న పరిస్థితులు, అవసరాలు, టెక్నాలజీని వినియోగించుకుంటే ఫొటోగ్రఫీకి మరో వందేళ్లయినా భవిష్యత్ ఉంది. సెల్‌లో ఫొటో తీసినా ప్రింటింగ్ కోసం స్టుడియోలో అడుగు పట్టాల్సిందే.



వేలాది మందికి ఉపాధి

గతంలో పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన స్టుడియోలు నేడు గ్రామాల్లోనూ దర్శనమిస్తున్నాయి. ఆసక్తితో కొందరు, బతుకు తెరువు కోసం మరికొందరు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ వృత్తికి సంబంధించి స్టుడియోలు, ల్యాబ్‌లు, మిక్సింగ్ యూనిట్లు, లేమినేషన్ సెంటర్లలో జిల్లాలో సుమారు 30 వేల మంది వరకూ ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

విత్తనాలతో రాఖీలు

● కంచరాం ఉన్నత పాఠశాల విద్యార్థినులు తయారీ



విత్తనాలతో తయారుచేసిన రాఖీలు, (ఇన్‌సెట్)లో తయారు చేస్తున్న విద్యార్థినులు

రాజాం రూరల్: రంగు రంగులతో.. విభిన్న మోడళ్లతో.. కళ్లకు ఇంపు కలిగించేలా మార్కెట్లో రాఖీలు రాజ్యమేలు తుంటే.. వాటి జోలికి పోలేదు కంచరాం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు.. ఏటా ఏదో ఒక కొత్తదనానికి ప్రాధాన్యతనిచ్చే అక్కడి విద్యార్థులు చేతిచమురు వదలకుండా.. తక్కువ ఖర్చుతో పర్యావరణ పరిరక్షణకు భంగం కలగకుండా రాఖీలు తయారు చేయాలని ఓ నిర్ణయానికొచ్చారు. విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులు పండూరు వేణుగోపాల్, బి.మహేశ్వరరావు సహకారంతో గ్రామాల్లో లభ్యమయ్యే విత్తనాలతో రాఖీలు చేయాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా బీర, బెండ, చిక్కుడు, కాకర, ఆనప, గోంగూర విత్తనాలతో పాటు కాగితాలు, రంగు రిబ్బన్లు, అట్టముక్కలు, గమ్‌ను ఉపయోగించి పాఠశాల విద్యార్థినులు ఎం.లక్ష్మి, పి.అక్షయ్య కె.హిమల తదతరులు రాఖీలు తయారుచేశారు. తోటి విద్యార్థులకు అందజేశారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం వీవీ వసంతకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని బుచ్చింపేట గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం చూపారు. ఇటీవల గ్రామానికి వచ్చిన కోండ్రుకు గ్రామంలోని లోవోల్టేజ్ సమస్యపై టీడీపీ నాయకులు, ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన కోండ్రు విద్యుత్ శాఖ ఏఈ కుమార్‌ను లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించడంతో అధికారులు చర్యలు తీసుకొని కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దాంతో ఎంతో కాలంగా ఉన్న లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం దొరకడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

తరగతులను పునరుద్ధరించాలి

బొబ్బిలి రూరల్: మండలంలోని చిత్రకోట బొడ్డవలస పంచాయతీ పరిధి, నిమ్మలపాడు గిరిజన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 3, 4, 5 తరగతులను పునరుద్ధరించాలని ఆదివారం ఆ గ్రామానికి వెళ్లిన యూటీఎఫ్ బృందానికి గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర మహిళా సభ్యురా లు విజయగౌరి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 1, 2 తరగతులకు మాత్రమే ఇక్కడ పాఠశాల ఉందని, ఆపై తరగతులకు 3 కి.మీ దాటి కాలినడకన పిల్లలు తాడి లోవ పాఠశాలకు వెళ్తున్నారని, పిల్లలు తిరిగి వచ్చేంతవరకు అటవీ ప్రాంతం వలన భయంతో బిక్కు బిక్కుమంటున్నామని సర్పంచ్ వండీక వెళంగిని అన్నారు. విజయగౌరి వారిచ్చిన వినతిపత్రాన్ని తీసుకుని, ఈ సమస్యను బొబ్బిలి ఎమ్మెల్యే, విద్యాశాఖాధికారులకు తెలియజేస్తానన్నారు.

మొక్కలు నాటడం మన బాధ్యత

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పట్టణంలోని దాడితల్లి కాలనీలో రోడ్డుకిరువైపులా ఆదివారం గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్ వి రమణమూర్తి ఆధ్వర్యంలో సభ్యులు సుమారు 100 మొక్కలు నాటారు. కాలనీ పెద్దలు ఈదుబిల్లి శ్రీనవాసరావు, వీర బొబ్బిలి మాజీ సైనికుల అధ్యక్షులు రేవళ్ల కిరణ్ కుమార్, రవికిరణ్, లక్ష్మణరావు, చప్ప అప్పలనాయుడు, వెంకట నాయుడు, సింహాచలం, తాన్న వెంకటరమణ, యలమంచలి శ్రీను, స్వామి, శ్రీరాములు, తవిటినాయుడు, సిహెచ్ వెంకటరమణ, వివి రాజు, జగన్నాథం నాయుడు తదితురులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

రాజాం: మండలం బొమ్మినాడువలస గ్రామంలో జనసేన పార్టీ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జనసేన జెండా ఎగరవేయడమే కాకుండా పార్టీని బలోపేతం చేసేలా అందరూ కృషి చేయాలన్నారు. సర్పంచ్‌లకి విలువ పెంచే విధంగా ప్రతి పంచాయతీకీ నగదు అందించి వేడుకలు సంతోషంగా జరిపించుకోవాలని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చెప్పడం చాలా సంతోషం అన్నారు. రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు, జిల్లా సం యుక్త కార్యదర్శి చిన్నంనాయుడు, సైడాల జన, ఉపాధ్య క్షులు రాము, అన్నంనాయుడు, గార శివరాం, పాతినవలస త్రినాథ, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

హరిత రక్షా బంధన్



చెట్లకు రాఖీ కట్టిన దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో రక్షాబంధన్ పురస్కరించుకుని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎజ్జల మోజేష్, వనమిత్ర కృష్ణదాస్ విద్యార్థులచే వినూత్నంగా చెట్టుకు రాఖీ కట్టించారు. రక్షాబంధన్ సందర్భంగా చెట్లకు రాఖీ కట్టి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయాలని ప్రతి ఒక్కరికీ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు గంటలు.. ఇలానే..



ఇది భామిని మండలం బిల్లుమడ రోడ్డు. భారీ గోతులతో నిండిన ఈ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. గోతుల్లో వర్షపు నీరు చేరగా.. కొన్నిచోట్ల బురదమయంగా మారింది. కాగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తున్న ఓ ఇసుక లారీ బిల్లుమడ రోడ్డు మధ్యలో దిగబడింది. బురదలోకి చక్రాలు కూరుకుపోయాయి. దీంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. చివరకు లారీ కార్మికులు ఎక్స్‌కవేటర్ సాయంతో ఆ వాహనాన్ని బయటకు తీశారు. దీంతో యథావిధగా వాహన రాకపోకలు సాగాయి. తరచూ ఈ మార్గంలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

\- భామిని

రాజాంలో కలకలం

● రాత్రి వేళ ఓ వ్యక్తిపై కత్తి దాడి ● బాధితుడి పరిస్థితి విషమం

రాజాం రూరల్, ఆగస్టు 18: బొబ్బిలి జంక్షన్‌లో ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఒక్కసారిగా కలకలం రేగింది.. ఆటోతో ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తి బొబ్బిలి జంక్షన్‌లో ఉన్న మరో వ్యక్తిని కలిశాడు.. కాసేపు ఇద్దరూ మాట్లా డుకున్నారు.. ఏమైందో ఏమోగాని.. ఆటోతో వచ్చిన వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఛాతి పైభాగంతో పాటు వీపు వెనుక భాగంలో బలంగా కత్తితో పొడిచి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో పాటు రక్తస్రావంతో బాధపడుతూ నేరుగా రాజాం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు.. క్షణాల్లో స్పందించిన రాజాం పోలీసులు 108 సాయంతో రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తికి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. కత్తితో గాయపరిచిన వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని మల్లిఖార్జునకాలనీకి చెందిన పడాల శేఖర్ ఆదివారం రాత్రి బొబ్బిలి జంక్షన్ మీదుగా ఆటోతో ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో గొల్లవీధికి చెందిన నాగళ్ల గణేష్‌ను చూసి ఆటో ఆపాడు.. తన భార్యను ఎందుకు వేధిస్తున్నావని ప్రశ్నిస్తూ తన భార్య ఫొటోలను సెల్ నుంచి తీసేయాలని కోరాడు. శేఖర్ మాటల్ని విభేదించిన గణేష్ కోపంతో శేఖర్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. రక్తస్రావంతో శేఖర్ రాజాం పోలీస్ స్టేషన్‌కు ఆటోతో వెళ్లి స్టేషన్ ప్రాంగణంలో పడిపోయాడు. పరిస్థితిని గమనించిన పోలీసులు 108 సాయంతో రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలంతో పాటు రాజాం సామాజిక ఆసుపత్రిని రూరల్ సీఐ ఉపేంద్రరావు పరిశీలించారు. ఎస్ఐ రవికిరణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే తాను శేఖర్‌ను కత్తితో పొడవలేదని, అతనే తనకు తానుగా కత్తితో పొడుచుకున్నాడని గణేష్ చెబుతున్నాడు. నాగళ్ల గణేష్ ఆదివారం రాత్రి రాజాం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.



దాడిలో గాయపడిన శేఖర్

విద్యుదాఘాతంతో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

బొబ్బిలి/రూరల్, ఆగస్టు 18: బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న గడిదీసు చంటి(20) ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. కాకినాడలో ఇంజినీరింగ్ చదువుకుంటున్న చంటి సెలవులకు గ్రామానికి శుక్రవారం వచ్చాడు. గ్రామంలో స్నేహితులందరితో కలిసి వినాయక ఉత్సవాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. పక్కనే గల ఎం.బూర్జివలస గ్రామానికి వెళ్లి వెదురుబొంగులను సేకరించి తిరిగి గ్రామానికి తరలిస్తుండగా బూర్జివలస రైల్వేట్రాక్ సమీపంలో హెచ్‌టీ విద్యుత్ లైన్లకు అప్పుడే నరికిన వెదురుబొంగులు తగలడంతో విద్యుదాఘాతం సంభవించి చంటి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా కన్నుమూశాడు. మృతునికి తండ్రి శ్రీనివాసరావు, తల్లి రాధ, ఇద్దరు అన్నలు ఉన్నారు. అగ్నివీర్ పథకంలో ఆర్మీలో చేరేందుకు సెలెక్షన్స్‌కు వెళ్లాడు. ఇంకా రన్నింగ్ ఈవెంట్ ఉంది. దీనికోసం వ్యాయామం, కసరత్తులు వంటివి చేస్తూ ఫిట్‌నెస్ కోసం శ్రమిస్తూనే వినాయక ఉత్సవాల కోసం తోటి స్నేహితులతో ఏర్పాట్లు చేస్తుండగా ఇలా అశువులు బాయడం దురదృష్టకరం. మృతదేహానికి స్థానిక సీహెచ్‌సీలో శవ పంచనామ నిర్వహించిన అనం తరం పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించామని ఎస్ఐ లోవరాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.



చంటి (ఫైల్)

ప్రతి ఇంటికీ తాగునీరే లక్ష్యం

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 18: జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ఎన్‌డీఏ కూటమి లక్ష్యమని కూటమి నేతలు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, ద్వాదశ సుమతి, వేణు, భూపతిరాజు అన్నారు. ఆది వారం 8వ డివిజన్ అయ్యన్నకోనేరు దక్షిణ గట్టు ప్రాంతంలో నివాసితులకు తాగునీరు కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన కుళాయిలకు మంచి నీటి సరఫరాను గత ప్రభుత్వం అన్యాయంగా నిలిపివేసిందన్నారు. దాసన్నపేట ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి నేడు కనెక్షన్ ఇచ్చి మంచినీటి సరఫరా పునరుద్ధరించామన్నారు. ఈ కార్యక్రమంలో రాజా భువన వర్మ, ఎన్ఎస్ఎన్ రాజు, గండబోయిన ప్రసాద్, బమ్మిడి రవి, గున్నాపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కుళాయిలను ప్రారంభిస్తున్న కూటమి నేతలు

విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని నిమ్మలపాడు గిరి జన గామంలో ఆదివారం వనమిత్ర కృష్ణదాస్ పిల్లలకు, విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనమిత్ర కృష్ణదాస్ మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సంస్థలు స్పందించి గిరిజ నులను ఆదుకోవాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర సభ్యురాలు విజయగౌరి తదితరులున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



బొబ్బిలిలో..



విజయనగరంలో..

విజయనగరం దాసన్నపేట: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కొలకొత్తాలో మెడికల్ కళాశాల విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎంఏ ప్రతినిధి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సన్యాసమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్‌బీజీ భవనంలో జేవీవీ సమతా కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి నిర్మల అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డాక్టరు సన్యాసమ్మ హాజరై మాట్లాడుతూ, దేశంలో వివిధ సందర్భాల్లో డాక్టర్లపై దాడులు చేసిన సంఘటలు రోజురోజుకి పెరుగుతున్నాయన్నారు. జేవీవీ ప్రతినిధులు వెంకటరావు, లక్ష్మీ, రాజగోపాల్, దివాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి:** కోల్‌కత్తాలోని ట్రైనీ వైద్యురాలిని హతమార్చిన దుండగులకు ఉరిశిక్ష వేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పాకీ వీధిలోని అంబేడ్కర్ విగ్రహం ముందు ఆదివారం మోకాళ్లపై నిలుచొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మండల సీపీఎం కార్యదర్శి ఎస్.గోపాలం,సీఐటీయూ నాయకుడు ఎ.సురేష్‌లు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోనికి వచ్చిన తరువాత మహిళలకు పూర్తిగా రక్షణ లేకుండాపోయిందన్నారు.

సంక్షోభంలో చేనేత పరిశ్రమ

● గోదాములో రూ.25 లక్షల విలువ చేసే సరుకు ● పనులు లేక కార్మికుల ఇక్కట్లు ● వస్త్రాలు కొనేవారు లేక ఇబ్బందులు

రామభద్రపురం: చేనేత కార్మికుల వెతలు రానురానూ అధికమవుతున్నాయి. ఈ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతోంది. గత అయిదేళ్ల వైసీపీ పాలనలో చేనేత కార్మికుల ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావు. కార్మికులు నేసిన వస్త్రాలు ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో అప్పుల భారం పెరిగిపోయి... ఉపాధి కరువై అవస్థలు పడుతున్నారు.



అమ్ముడుపోక గోదాములో నిల్వ ఉన్న బట్టలు

కొట్టక్కి గ్రామంలో చేనేత సహకార సంఘం ద్వారా రామభద్రపురం, బాడంగి, సాలూరు, పాచిపెంట మండలాలకు చెందిన వందలాది చేనేత కార్మికులు ఎన్నో ఏళ్ల నుంచి మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు సహకారం అందించకపోవడంతో గత అయిదేళ్లు నరక యాతన అనుభవించారు. ఈ సొసైటీ పరిధిలో ప్రస్తుతం రూ.25 లక్షల విలువ చేసే వస్త్రాలు గోదాంలో పడి ఉన్నాయని.. ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో సొసైటీ దివాలా తీయడమే కాకుండా బ్యాంకు ద్వారా తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేని పరిస్థితి నెలకొందని కార్యదర్శి చుక్కల చిన్నారావు తెలిపారు. పదేళ్ల కిందట టీడీపీ అధికారంలో ఉన్నపుడు నూలుపై 40 శాతం రాయితీ, పావలా వడ్డీ, క్యాష్ క్రెడిట్ అమలయ్యేవని కార్మికులు గుర్తు చేస్తున్నారు. దీని వల్ల నేతన్నలకు మేలు జరిగేదని అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులకు వైఎస్ఆర్ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప శాశ్వత ఉపాధి కోసం ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చేనేత రంగాన్ని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవడమే కాకుండా మూలనపడి ఉన్న స్టాకును కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



కొట్టక్కి చేనేత సహకార సొసైటీ భవనం

ఉపాధి కరువైంది..

వైసీపీ పాలనలో చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. దుస్తులు కొనుగోలు చేయకపోవడంతో సకాలంలో మాకు కూలీ డబ్బులు రాలేదు. కూలీ రేట్లు పెంచకపోవడం, నూలుపై సబ్సిడీ లేకపోవడంతో చేనేత కార్మికులకు ఉపాధి కరువైంది.

\-విశ్వేశ్వరరావు, నెలిపర్తి, సాలూరు మండలం

అప్పులు తీర్చడం కష్టం..

కొట్టక్కి చేనేత సొసైటీ ఆధ్వర్యంలో సుమారు రూ.25 లక్షల విలువ చేసే స్టాకు నిల్వ ఉంది. దీనిని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో బ్యాంకు అప్పులు తీర్చలేకపోతున్నాం. పనులు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వస్త్రాలు కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలి.

\-చిన్నారావు, కార్యదర్శి, కొట్టక్కి చేనేత సహకార సంఘం

గోవాకు గంజాయిని తరలిస్తుండగా...

● గజపతినగరంలో ఒడిశా వాసి అరెస్టు



మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు

గజపతినగరం: ఒడిశా నుంచి గోవాకు గంజాయిని తరలిస్తుండగా గజపతినగరంలో పట్టుబడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం గజపతినగరం పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. ఒడిశాలోని గరియాబంద జిల్లా నిస్తిగుడ గ్రామానికి చెందిన దేవేంద్రకుమార్ మంజీ గోవా ఉపాధికోసం వెళ్లాడు. అక్కడ నవరంగపూర్‌కు చెందిన మహదేవ్ బర్మలీతో పరిచయం ఏర్పడింది. కొంత కాలం పని చేసిన దేవేంద్రకుమార్ ఇంటికి చేరుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల గోవాలో ఉన్న మహదేవ్ బర్మలికి ఫోన్‌చేసి తనకు పని కల్పించాలని తాను గోవా వస్తానని తెలియజేశాడు. దీంతో మహదేవ్ బర్మలి తాను పని కల్పిస్తాని, వచ్చేటప్పుడు నా ఫ్రెండ్ ఒక ప్యాకేజీ అందజేస్తాడని అది పట్టుకొని నీవు రావాలని అందుకు పది వేలు నీ అకౌంట్‌లో వేస్తానని పేర్కొన్నాడు. దీంతో దేవేంద్రకుమార్ మంజీ రైలులో వచ్చి, శనివారం గజపతినగరం రైల్వే స్టేషన్‌లో దిగాడు. విజయనగరం వెళ్లేందుకు రైల్వేస్టేషన్ దాటుతుండగా ఎస్ఐ, సిబ్బంది తనిఖీచేస్తుండగా పట్టుబడ్డాడు. తనిఖీల్లో బ్యాగ్‌లో నాలుగు కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఎస్ఐ మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుపై కేసు నమోదు

భోగాపురం, ఆగస్టు 18: గృహిణిని వరకట్నం తీసుకురావాలంటూ వేధించడంతో భర్తపై కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఎస్ఐ పి.సూర్యకుమారి ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చాకివలసకు చెందిన పద్మజ్యోతికి, శ్రీకాకుళం చిన్నబజారుకు చెందిన వడ్డాది శంకర్‌గుప్తకు గతేడాది వివాహమైంది. వివాహం సమయంలో 17 తులాలు బంగారం, 2 కేజీల వెండి, ఆత్తఆడపడుచులకు రూ.6లక్షలు నగదును కట్నకానుకలుగా అందజేశారు. అయితే ఇటీవల కారు కొనుక్కోవడానికి రూ.10లక్షలు కట్నం తేవాలని భర్త వేధించడం మొదలు పెట్టాడు. భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచులు వేదించడమే కాక కట్నం తీసుకొచ్చే వరకు ఇంటికి రావద్దంటూ భార్యను పుట్టింటిలో వదిలేశాడు. దీంతో బాధితురాలు వడ్డాది పద్మజ్యోతి ఫిర్యాదు మేరకు వరకట్న వేదింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పిడుగుపాటుకు మేకలు మృతి



మృతి చెందిన మేకలు

శృంగవరపుకోట, ఆగస్టు 18: పిడుగుపడి మేకలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి బాధితులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చుక్కవానిపాలెం గ్రామానికి చెందిన వారాది అప్పలనాయుడు మేకల పెంపకం చేపడుతూ జీవనం సా గిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ధర్మవరం సమీపంలో రొంగలి వాని కల్లాల వద్ద మేకలు కాస్తుండగా పిడుగుపడడంతో పదిమేకలు మృతి చెందాయి. దీంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

పాలకొండ: మండలంలోని అట్టలి సమపంలో అదపాక గోవింద్(22) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ మండలం పొట్లిలి గ్రామానికి చెందిన అదపాక గోవింద్ ప్రేమ వివాహం చేసుకున్నారు. గడిచిన కొద్ది నెలలుగా భార్యభర్తల మధ్య ఏర్పడిన వివాదంతో ఇటీవల భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక సమాచారంగా పోలీసులు వెల్లడించారు. మృతుని తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఆదివారం మృతదేహానికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

ఓవర్‌లోడ్‌తో విద్యార్థులను తరలిస్తే చర్యలు

విజయనగరం క్రైం, ఆగస్టు 18: జిల్లాలో ఓవర్‌లోడ్‌తో విద్యార్థులను తరలించే ఆటోలు, ఇతర వాహనాలపై రవాణాశాఖ ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని పట్టుబడ్డ వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్ హెచ్చరించారు. రవాణాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, త్వరలో అన్ని విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని అనంతరం, ఆటో యూనియన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తనిఖీలు విస్తృతం చేస్తామన్నారు. ఇటీవల కాలంలో ఒక్కొక్క ఆటోలో 15 నుంచి 20 మంది చిన్నారులను స్కూల్‌కి తరలిస్తున్నారని, ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలన్నారు. ఫిట్‌నెస్, లైసెన్సు, వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని ఆటోలపై, స్కూల్ బస్సులపై కొరడా ఝళిపిస్తామని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో వాహనాలు పట్టుబడితే, సీజ్ చేస్తామని ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా రవాణాశాఖ ఎన్‌ఫోర్సుమెంటు టీంలతో దాడులు కొనసాగిస్తామన్నారు. ఓవర్ స్పీడ్‌తో ప్రయాణించినా, ట్రిబుల్ రైడింగ్, పొల్యూషన్ సైలె న్సర్లు, హెల్మెట్ లేని వాహనదారులపై చర్యలు తప్పవన్నారు.

రక్తదానం మనందరి బాధ్యత

రాజాం: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రమణం స్వామినాయుడు సూచనలతో ఓ పాఠశాలలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రూరల్ సీఐ ఉపేంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, వికాస తరంగణి కేంద్ర కమిటీ సభ్యులు రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ అవసరమైన సమయంలో రక్తం లేక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

రాజాం: శ్రీ సత్యసాయి సేవా సమితి సుందరం మందిరంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆదివారం సుందరం మందిరంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలకు 108 మంది కంటి రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా 51 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని కన్వీనరు ముప్పిడి శ్రీనివాసరావు, మానం వెంకటేష్ తెలిపారు. కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించామన్నారు. శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ సాయికుమార్, ఆదినాయుడు, అద్దంకి సూర్యరావు, శ్రీనివాసరావు, ఎం తిరుపతిరావు, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. నిరుపయోగం



● ఇదీ సాలూరు మునిసిపల్ కార్యాలయం వద్ద ఉన్న వాహనాలు, యంత్రాల పరిస్థితి

సాలూరు: సాలూరు మునిసిపల్ కార్యాలయం ఆవరణలో 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన యంత్రాలు, వాహనాలు నిరుపయోగంగా పడిఉన్నాయి. ప్రధానంగా నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఆర్థికసంఘం నిధులు రూ. 30 లక్షలు వెచ్చించి వీటిని కొనుగోలుచేశారు. వీటిని ఉంచేందుకు షెడ్ లేకపోవడంతో ఎండకు ఎండి వర్షానికి తడిచి పాడవుతున్నాయి. ఈ నేపథ్యంలో మునిసిపల్ పాలకమండలిలో షెడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలుచేసినా ఆమోదం లభించలేదు. కేంద్ర ప్రభుత్వం నిధులతో యంత్రాలు, వాహనాలు కొనుగోలుకు అధికారులు, ప్ర జాప్రతినిధులకు ఉన్న శ్రద్ధ నిర్వహణపై లేదన్న విమర్శలొస్తున్నాయి. తక్షణమే మునిసిపల్ అధికారులు వాహనాలను వినియోగంలోకి తీసుకువచ్చి, భద్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వర్షంలో తడుస్తున్న వాహనాలు,యంత్రాలు

వసతులు ఉన్నా... సేవలందక

● రిఫర్‌చేస్తుండడంతో రోగుల ఆరోపణ ● ఇదీ గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో పరిస్థితి

గజపతినగరం: గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో సిబ్బంది, వసతులు, పరికరాలు ఉన్నా రోగులకు సేవలందడం లేదు. ప్రధానంగా ఇక్కడ వచ్చే కేసులు విజయనగరం తదితర ప్రాంతాలకు రిఫర్‌చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్‌కు దీటుగా సేవలందించాలన్న ప్రకటనలు అటకెక్కుతున్నాయి. ప్రధానంగా ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్‌చేస్తుండడంతో ఆర్థిక ఇబ్బందిపడుతున్నామని రోగులు వాపోతున్నారు.

తనిఖీలు చేసినా.. మార్పు రాక

గజపతినగరంలోని ఏరియా ఆసుపత్రికి గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాలకు చెందిన రోగులు ప్రతిరోజూ 250నుంచి 300 వరకు వైద్యసేవలు నిమిత్తం వస్తుంటారు. ఇక్కడ వైద్యులు ఉన్నా సేవలు అంతంతమాత్రంగా ఉండడంతో పలువురు రోగులు పట్టణంలో ప్రైవేటు లేదా విజయనగరంలోని ఆస్పత్రులకు వెళ్లాల్సివస్తోంది. ఆసుపత్రిలో ముగ్గురు గైనకాలజిస్టులు ఉన్నా ప్రస వాలకోసం ప్రైవేటు ఆసుపత్రులు, జిల్లా కేంద్రం లోగల ఘోష, లేదా సర్వజన ఆసుపపత్రికి రిఫర్ చేస్తుం డడం విశేషం. రెండు నెలలు నుంచి పీహెచ్‌సీల్లోనే ప్రస వాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో దగ్గరలో గల ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాలని ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే.అయితే అత్యవసర కేసులు ఏరి యా ఆసుపత్రికి రిఫర్ చేసినా వారు కూడా అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారని అందుకు తామే నేరుగా అత్యవసర కేసులను జిల్లా కేంద్రా సుపత్రికి తరలిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యులు చెబుతున్నారు. జిల్లా అధి కారులు పలుసార్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టి రిఫర్ కేసులు తగ్గించాలని ఆదేశాలు జారీచేసినా మార్పురావడం లేదని రోగులు వాపోతున్నారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరీక్షలకు సంబంధించి పరికరాలు ఉన్నా అవసరమైన పరీక్షలు ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సివస్తోందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఇక్కడ హెర్నితోపాటు ఇతర శస్త్రచికిత్సలు జరిగేవి.అయితే ప్రస్తుతం సివిల్ సర్జన్ ఉన్న సేవలు అందడంలేదని పలువురు రోగులు వాపోతు న్నారు. రేడియాలజీ, జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ వైద్యులు లేక పోవడంతో రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందాల్సి వస్తోంది.



ఆసుపత్రిలో రోగులు నిరీక్షిస్తున్న దృశ్యం

ఇరుకు గదుల్లో వైద్య సేవలు..

టీడీపీ హయాంలో గతంలో 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు రూ.17 కోట్ల మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అప్పట్లో పనులు కొంత మేర సాగినా, 2019 ఎన్ని కలు రావడం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. దీంతో రోగులకు 30 పడకల ఆసుపత్రిలోనే రోగులకు వైద్య సేవలు అందించాల్సి వస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు.. వందపడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితేనే మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉందని రోగులు చెబుతున్నారు.మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇటీవల ఆస్పత్రిని పరిశీలించిన సమయంలో సిబ్బంది సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కరించేందుకు హామీఇచ్చారు.



అర్థాంతరంగా నిలిచిపోయిన వంద పడకల ఆసుపత్రి

ప్రైవేటు ల్యాబ్‌లకు రాస్తే చర్యలు..

ఆసుపత్రిలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందజేయనున్నట్లు గజపతి నగరం ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారి జగదీష్ తెలిపారు. శస్త్ర చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు జరగాలని తెలిపారు.ప్రైవేటు ల్యాబ్‌లకు రాస్తే చర్యలు తప్ప వని చెప్పారు. వందపడకల ఆసుపత్రి పూర్తికాకపోవడంతో రోగులు ఇబ్బం దిపడాల్సి వస్తోందని, ఇరుకు గదుల్లో వైద్య సేవలు అందజేయాల్సి వస్తుం దని చెప్పారు. రెండురోజుల కిందట మంత్రి ఏరియా ఆస్పత్రి పరిశీలించిన సమయంలో ఆయన దృష్టికి సమస్యలు తీసుకువెళ్లినట్లు చెప్పారు.

పర్యవేక్షణ లేక.. సాగుకు నీరందక

● మరమ్మతుకు నోచుకోని నళిని కృష్ణసాగర్ ● వృథాగా పోతున్న నీరు..ఆందోళన చెందుతున్న రైతులు

సీతంపేట: నళిని కృష్ణసాగరంపై నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంతో ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. దశాబ్దాల కిందట నిర్మించిన కాలువలు కావ డంతో పూర్తిగా పాడయ్యాయి. దీంతో కాలువల నుంచి నీరు గెడ్డలోకి వృథాగా పోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తాత్కాలికంగా ఇసుక మేటలు వేసి..

మండలంలోని చిన్నబగ్గ పంచాయతీ పరిధిలో ఉన్న నళిని కృష్ణ సాగరం లోని సాగునీరు వృథాగా పోతోంది. దీంతో ఖరీఫ్‌లో సైతం ఆయ కట్టుకు నీరందడం లేదు. ఆరేళ్ల కిందట నళిని కృష్ణసాగర్ ప్రధానకాలువ పూర్తిగా పాడవడంతో నీరంతా గెడ్డలోకి చేరుతోంది. ఈ నేపథ్యంలో రైతులు కాలు వల్లో అక్కడక్కడ తాత్కాలికంగా ఇసుక మేటలు వేసి రైతులు నీటిని వినియోగించుకుంటున్నారు. కాలువ దుస్థితిని గతంలో పలుసార్లు అధికారుల దృష్టికి తీసు కెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందని చిన్న బగ్గ కాలనీకి చెందిన రైతు సన్యాసిరావు, తది తరులు వాపోతున్నారు. తక్షణమే మరమ్మతు లు చేస్తే 500 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగు లోకి వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రధా న కాలువపాడవడంతో నీరంతా వృథాగా పోతోం దని, మరమ్మతు చేసి ఆయకట్టుకు నీరందిం చాలని రైతులు కోరుతున్నారు. కాగా నళిని కృష్ణసాగర్ మరమ్మతులు రెగ్యులర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్నారని ఐటీడీఏ చిన్న తరహా నీటిపారుదల అధికారులు చెబుతున్నారు.



గెడ్డలోకి వృథాగా పోతున్న నళినీ కృష్ణసాగర్ ప్రధాన కాలువ నీరు

హర్యానా చేరిన ఉపాధ్యాయుల మృతదేహాలు

సాలూరు: పాచిపెంట మండలంలోని సరాయివలస (కోటికిపెంట) ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సోషల్ టీచర్ కమ్ వార్డెన్ మహేష్ (27), జాగ్రఫీ ఉపాధ్యాయిని ఆర్తి (23)మృతదేహాలు హర్యానాలోని స్వస్థలాలకు చేరా యి.సోనిపేట జిల్లాలో తాజ్‌పూర్ టిహ్రాఖాండ్‌కు చెందిన మహేష్,అదే రాష్ట్రంలో మహేంద్రఘర్ జిల్లాలో బలవంత్‌బజార్‌కు చెందిన ఆర్తీమృతదేహాలను ఇంటికి చేర్చారు. జూన్ 20న వారు విధుల్లో చేరారు.సాలూరు పట్టణంలోని అద్దె ఇళ్లలో వేర్వేరుగా నివసిస్తున్నారు. రోజూలానే శుక్రవారం విధులు ముగించుకుని బైక్‌పై వారు పాఠశాల నుంచి సాలూరు బయల్దేరారు. మార్గమధ్యలో సరాయి వలస సమీపంలో ఉన్న కొండవాగు గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో కొద్దిసేపు అక్కడ నిరీక్షించారు. అనంతరం ఓ బైక్ వాగు దాటి వెళ్లగా.. వీరు కూడా ప్రయత్నించా రు.అయితే వాగుదాటుతుండగా..వరద ఉధృతికి బైక్‌తోసహా వారు గల్లంతయ్యా రు. టీచర్ ఆర్తి మృతదేహం ఆరోజే లభించగా.. శనివారం వార్డెన్ మహేష్ మృత దేహాన్ని మాతుమూరు సమీపంలో అధికారులు గుర్తించారు. రెండు మృతదేహా లను పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. విష యం తెలుసుకున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆసుపత్రికి చేరుకుని ఏకలవ్య, ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, విమాన యానశాఖ అధికారులతో మాట్లాడారు. అంబులెన్స్ ద్వారా మృతదేహాలను సాలూరు నుంచి విశాఖకు, అక్కడ నుంచి విమానంలో హర్యానా రాష్ట్రానికి పంపించారు. ఆయా కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

బంధువులు కృతజ్ఞతలు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి/సాలూరు): మృతదేహాలను విమానంలో తర లించి చివరి నిమిషం వరకు సహాయపడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుకు, మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు రుణపడి ఉం టామని మహేష్, ఆర్తి కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి. మృతదేహాలు చేరాయని అక్కడ నుంచి మంత్రి సంధ్యారాణి ఫోన్లో వారి కుటుంబ సభ్యులు మాట్లాడారు. ఇతర రాష్ట్రాలకు చెందినవారిమైనా తమ సొంత కుటుంబ సభ్యుల వలే చూసు కున్నారని తెలిపారు.

సమాజ సేవలో తరించాలి

పార్వతీపురంటౌన్: సమాజసేవలో ప్రతిఒక్కరూ తరించాలని ఎమ్మెల్యే విజ యచంద్ర సతీమణి అనూష తెలిపారు. ఆదివారం పార్వతీపురంలోని రైల్వే స్టేష న్, ఆర్టీసీకాంప్లెక్స్ ప్రధాన రహదారి ప్రాంతాల్లో ఉండే నిరాశ్రయులకు ఆహా రంతోపాటు దుప్పట్లు, చీరలు, పేదవిద్యార్థులకు పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మథర్‌థెరిసాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

గరుగుబిల్లిలో సుదర్శన హోమం

గరుగుబిల్లి : గరుగుబిల్లి షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం సుదర్శన హోమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన యజ్ఞ యాగకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో రుత్వికులు సత్తె నరసింహా చార్యులు సుదర్శన హోమం జరిపించారు. మొండెంఖల్, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పూజలు జరిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మండల పంచాయతీ విస్తరణాదికారి ఎల్.గోపాలరావు సూచించారు. ఆదివారం మండలంలోని రావివలస ప్రధానవీధుల్లో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. వ్యర్థాలను రహదారులపై నిల్వ చేయకుండా వాహనాల్లో వేరే ప్రాంతాలకు తరలించాలన్నారు. కాలువల్లో దోమలు నివారణ మందు పిచికారీ చేయాలన్నారు. వైద్య సిబ్బంది జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించి అవసర మైన చికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్.శశికుమార్, సర్పంచ్ బి.అప్పడు పాల్గొన్నారు.

నిలకడగా నాగావళిలో ప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేసిన నీటి ప్రవాహం

గరుగుబిలి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో కొంతమేర వర ద ప్రవాహం నదిలోకి చేరుతోంది.శనివారం వరకూ రెండువేల క్యూసెక్కు లకుపైగా నీరురావడంతో అధికారులు అంతేస్థాయిలో దిగువకు విడుదలచేశారు. అయితే ఆదివారం పైప్రాంతాల నుంచి నదిలోకి 1,775 క్యూసెక్కుల నీరు రాగా 500 క్యూసెక్కులకు పైగా దిగువకు విడుదలచేశారు. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధానకాలువల నుంచి 1,290 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నా మని ప్రాజెక్టు డీఈ టి.రఘునాధనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్ కుమార్‌లు తెలిపారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.40 మీటర్ల నీరు నిల్వఉంది. ప్రాజెక్టులో 2.534 టీఎంసీలకు గాను 2.136 టీఎంసీల నీరుఉంది.

ఆరోగ్య కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

●యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఈయూ రాష్ట్ర కార్యదర్శి సాయి ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

బెలగాం: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తల సమ స్యలు పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూని యన్ రాష్ట్ర కార్యదర్శి సాయిప్రసాద్ కోరారు. ఆదివారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో గ్రామ, వార్డు సచివాలయాల ఆరోగ్య కార్యకర్తల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ సచివాల యంలో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలకు డీడీవో పరిధి నుంచి ఆరోగ్య కేంద్ర వైద్యా ధికారికి పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎంలకు పని భారం తగ్గించాలని కోరారు.సీనియారిటీ ప్రకారం బదిలీలు చేపట్టాలని కోరారు. అనంత రం గ్రామ, వార్డు సచివాలయాల ఆరోగ్య కార్యకర్తల జిల్లా కమిటీని ఎన్నుకున్నా రు. జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్ స్వర్ణలత, ప్రధానకార్యదర్శిగా ఎం.ఇందిరా, కమి టీ సభ్యులుగా బి.రమాదేవి తదితరులతో 15 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు పౌరసన్మానం



కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

రాయగడ:రాయగడలోని బాలాజీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తరపున పోటీచేసి గెలుపొందిన ప్రజా ప్రతినిధులకు ఆదివారం పౌర సన్మానంచేశారు. రాయగడ జిల్లాలోని గుణుపురం, బిసంకటక్, రాయగడ శాసనసభ స్థానాలతో పాటు అవిభక్త కొరాపుట్ స్థానం నుంచి గెలుపొందిన సత్యజిత్ గొమాంగ్, నీలమాధవ హిక్కాక, అప్పలస్వామి కద్రకలతోపాటు ఎంపీ సప్తగిరిఉలకాలను సత్క రించారు.ఈసందర్భంగా సభ్యులు మాట్లాడుతూప్రజల ఆకాంక్షల మేరకు రాయగడ జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని, పార్లమెంటు, శాసనసభలో ప్రజలవాణి వినిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ పూర్వ అధ్యక్షుడు కె. చం ద్రమౌళి కుముందాన్, పీసీసీసభ్యుడు దుర్గాప్రసాద్ పండా, రాఘవ కుముందాన్, సీనియర్ పాత్రి కేయుడు బాదల్‌థా మదన్‌మోహన్ పాఢి, వర్తక వాణిజ్య, చిన్నతరహా పరిశ్రమల, విడిది గృహాల, రైస్‌మిల్లుల యజమానులు, వివిధ కులసంఘాలు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

హత్యాచార దోషులను శిక్షించాలి



సాలూరు రూరల్: మెట్టవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు



గుమ్మలక్ష్మీపురం: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

● మెట్టవలస, తాడికొండలో వైద్యుల ర్యాలీ

సాలూరు రూరల్: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని తోణాం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత డిమాండ్ చేశారు. వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా సాలూరు మండలంలోని మెట్టవలసలో ఆదివారం వైద్యసిబ్బంది, గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మామిడిపల్లి పశు వైద్యాధికారి ప్రభాకర్, ఆరోగ్యసిబ్బంది, ఆదివాసీ జేఏసీ నేత ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. ●**గుమ్మలక్ష్మీపురం:** కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు నిరసనగా గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండలో పీహెచ్‌సీ వైద్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించు. ఈ కార్యక్రమంలో బుద్దేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల వివరాల సేకరణ



చిన్నదిమిలిలో రైతుల వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

భామిని: కేంద్ర ప్రభుత్వం పీఏసీఎస్‌లను ఆన్‌లైన్ చేయడానికి రైతు వివరాలను సేకరిస్తోంది. ఈ మేర కు ఆదివారం చిన్నదిమిలి, ఘనసర, తాలాడ తదితర గ్రామాల్లో ఇంటింటికి రెవెన్యూ సిబ్బంది వెళ్లి పది కాల మ్స్ ఉన్న ఫార్మెట్‌ను రైతుల వద్ద నుంచి సేకరిస్తున్నారు. ప్రతి రైతు ఆధార్, సెల్‌నెంబర్, నామినీ సేకరించి పీఏసీఎస్ అధికారులకు అప్పగించడంతో వాటిని ఆన్ లైన్‌లో నమోదు చేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా భామిని మండలాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ మేరకు డీటీ రమేష్ ఆధ్వర్యంలో రైతుల వివరాలను సేకరిస్తున్నారు.

కొండ శిఖర గ్రామాలకు రోడ్లు

● కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మారుమూల కొండ శిఖర గ్రామాలకు రహదారుల నిర్మా ణానికి తెలుగుదేశం ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. ఆదివారం మండ లంలోని లవముట పరిధిలోని కొండశిఖర గ్రామం కంబగోడ నుంచి డొంగరకిక్కువ గ్రామానికి నిర్మించనున్న రహదారికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజన ప్రాంతాల అభివృద్ధి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. నియోజక వర్గంలోని అన్ని కొండశిఖర గ్రామాలకు త్వరలో రహదారులు నిర్మిస్తామని, ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. ఆమె వెంట టీడీపీ మండల కన్వీనర్ పాడి సుధ, నాయకులు లక్ష్మణరావు, లోవరాజు, బిజెపి పార్టీ నాయకులు సింహాచలం తదితరులు ఉన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

తప్పిన పెను ప్రమాదం

● 33 కేవీ లైన్‌కు భారీ కంటైనర్ తాకడంతో షార్ట్ సర్క్యూట్

సీతంపేట: సీతంపేట కేజీబీవీ వద్ద ఆదివారం పెను ప్రమాదం తప్పింది. చెన్నై నుంచి బొంబాయి ఓ భారీ కంటైనర్ ఆదివారం ఉదయం పాలకొండ మీదుగా వెళ్తోంది. కంటైనర్ వాహనం ఎత్తు ఎక్కువగా ఉండడంతో సీతం పేట కేజీబీవీ సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్‌పైకి ఎత్తు తుండగాఒక్కసారిగా మూడు వైర్లు తగలడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతో సమీపంలో ఉన్న గృహాల్లో ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్‌ను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ వాహనాన్ని రాత్రి సమయం లో తరలించకుండా పగలు విద్యుత్ నిలుపుదల చేసి తరలించడానికి విద్యు త్‌శాఖ చర్యలు తీసుకుంది.



విద్యుత్ వైర్లకు తాకిన కంటైనర్

గ్రావెల్ రోడ్డు ఏర్పాటు

పాలకొండ: పట్టణంలోని గారమ్మకాలనీలో సరైన రహదారి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయం పలుసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో కాలనీకి చెందిన ప్రశాంత్ తన సొంత నిధులతో గ్రావెల్ రోడ్డు వేయించారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

చీపురుపల్లి: ధ్యానంతో మానసిక ప్రశాంతతను పొందవచ్చునని బ్రహ్మా కుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి రాజయోగిని బీకే అన్నపూర్ణ తెలిపారు. ఆదివారం చీపురుపల్లిలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారు తున్న కాలానికి అనుగుణంగా ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అలవర్చుకో వాలన్నారు. అనంతరం ఆమె పరిసర గ్రామాల నుంచి వచ్చిన బ్రహ్మకుమా రీలకు రాఖీ కట్టారు.

పెరటితోటలపై అవగాహన కల్పించాలి

కురుపాం రూరల్: పాఠశాలల ఆవరణలో పెరటితోటల పెంపకం చేపట్టి విద్యార్థుల్లో ఆ తోటలపై అవగాహన కల్పించా లని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం కొండ బారిడిలో జట్టు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డి.పారినాయుడు ఆధ్వర్యంలోనిర్వహిస్తున్న ప్రకృతివ్యవసాయ క్షేత్రాలను పరిశీలిం చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రపంచానికి ప్రకృతి వ్యవ సాయవిధానాలే శిరోధార్యమన్నారు.కొండబారిడిలో రైతులు అమ లుచేస్తున్న ప్రకృతి విధానాలను పరిశీలించి వారితో మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించడాన్ని ప్రశంసించారు.జట్టు సంస్థ రూపొం దించినబడి నుంచి పొలంబడికి పాఠ్యపుస్తకాలను పరిశీలించా రు. కార్యక్రమంలో జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డి. పారినాయు డు, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజరు షన్ముఖరాజు, ఎస్. ప్రహరాజ్, తుంబలి శివాజీ, మురళి, ప్రకృతి వ్యవసాయం సిబ్బం ది పాల్గొన్నారు.



పెరటితోటలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్